
కథ

# చిరునవ్వు దీపాలు

జె.ఆర్.సుధీర్

పుట్టినరోజు పండుగే అందరికి, కాని వివేక్‌కు మాత్రం అది పెద్ద గండం. వివేక్ బ్యాంక్‌లో ప్రొబేషనరీ ఆఫీసర్, మంచి జీతం, అర్థం చేసుకొనే భార్య వర్ధిని. గారాల కూతురు విశాలి. ఆర్థిక సమస్యలు, ఆరోగ్య సమస్యలు, అవగాహన సమస్యలు లేవు. ఐనా అతని పుట్టినరోజే అతనికి పెద్ద సమస్య.

వివేక్ వాచ్ చూసుకున్నాడు. సాయంత్రం ఆరు గంటలు అయింది. కాని అతనికి ఇంటికి వెళ్ళాలని లేదు. ఏదో విధంగా రాత్రి పది గంటలదాకా కాలక్షేపం చేసి అందరూ భోజనం చేసి పడుకున్న తరువాత వెళ్ళాలని ఉంది.



“వద్దు వద్దు వెళ్ళు, నాకింకా పని ఉంది” ప్యూన్ వెళ్ళిపోయాడు. వివేక్ ఆలోచిస్తున్నాడు.

***

వసంతమ్మగారికి పెళ్ళైన చాలా సంవత్సరాలకి ఎన్నో నోములు నోచుకుంటే వివేక్ పుట్టాడు. పిల్లవాడు సాయిబాబా అనుగ్రహమని వసంతమ్మగారు నమ్ముతారు. ప్రతి పుట్టినరోజున వివేక్‌ని పట్టుపంచెలో గుడికి తీసుకువెళ్ళి అర్చన చేయించటం తరువాత రెండు గంటలు భజన కార్యక్రమం వసంతమ్మగారికి ఒక ఆనవాయితీ. వివేక్ పూనె యూనివర్సిటీలో చదువుతున్నప్పుడు కూడా పుట్టిన రోజుకు హైదరాబాద్ వచ్చి పంచెకట్టుతో తల్లితో గుడికి వెళ్ళి తల్లి మురిపాన్ని తీర్చాడు. 25 సంవత్సరాలు అవిఘ్నంగా సాగిన ఈ అలవాటు వివేక్ పెళ్ళితో కొంచెం ఒడిదుడుకులకు గురైంది.

పెళ్ళి అయిన తరువాత మొదటి పుట్టిన రోజున భర్తను సర్‌ప్రైజ్ చేద్దామని రేమాండ్స్‌లో రెడిమేట్ సూట్ కొనుక్కొచ్చింది వర్ధిని. తన క్లోజ్‌ఫ్రెండ్ లత వాళ్ళ ఫ్యామిలిని, అమెరికా నుండి వెకేషన్ మీద వచ్చిన చెల్లె ఫ్యామిలీని ఆహ్వానించి హోటల్‌లో టేబుల్ రిజర్వ్ చేసుకొంది. వసంతమ్మగారి పూజా కార్యక్రమాలు వర్ధినికి తెలియదు. ఆఫీసు నుండి రాగానే తను తెచ్చిన సూట్ వేసుకోమంటుంది. తను ఏర్పాటు చేసిన డిన్నర్ పార్టీకి తయారవమంటుంది. భార్యను కూర్చోబెట్టి ప్రతి పుట్టినరోజు వసంతమ్మగారి పూజ, భజన కార్యక్రమాలు వివరిస్తాడు. వర్ధిని చాలా నిరాశ పడింది. కాని పెళ్ళైన తరువాత మొదటి పుట్టిన రోజవటం వలన అయిష్టంగానే ఒప్పుకుంది. తనని అంతగా నిరాశ పరచాల్సినందుకు వివేక్ కూడా చాలా బాధపడుతాడు. తరువాత సంవత్సరం వివేక్ పుట్టినరోజుకి కొన్ని రోజుల ముందు విశాలి జననం వలన సహజంగానే వర్ధిని దృష్టి వివేక్ మీద నుండి విశాలి వైపు మరలుతుంది.

వసంతమ్మగారు వరంగల్‌లో రెండవ కొడుకు దగ్గర ఉంటారు. వివేక్ ప్రతి పుట్టినరోజుకి వారం రోజులు ముందుగానే వరంగల్ వెళ్ళి తల్లిని హైదరాబాద్ తీసుకురావటం, వసంతమ్మగారు స్వయంగా వివేక్‌కి పట్టుపంచె, లాల్చి కొనడం, ఆ రోజు బ్యాంక్ నుండి త్వరగా వచ్చి సాయిబాబా గుడికి వెళ్ళటం, తరువాత మూడు గంటలు భజన కార్యక్రమం అంతా ఒక ఆనవాయితీగా జరిగిపోతుంది. వివేక్ పుట్టినరోజు భార్యకు సంబంధంలేని విషయంగా మారిపోయింది. కానీ వర్ధినిది ఏమి చేయలేని నిస్సహాయత, “హ్యాపీ బర్త్‌డే వివేక్” అని ముక్తసరిగా విష్ చేసి తన పనులలో మునిగిపోయేది. తరువాత ఒక నాలుగైదు రోజులు చాలా ముభావంగా ఉంటూ తన నిరసన తెలిపేది. అత్తా కోడళ్ల మధ్య ఎటువంటి అభిప్రాయ భేదాలు లేనప్పటికీ, ఈ ఆచారం తెలియకుండానే వారి మధ్య కొంత దూరాన్ని ఏర్పరచింది. ఎటువంటి వాగ్వివాదాలు లేనప్పటికి, ఒక ప్రచ్ఛన్న యుద్ధం, దాని బాధితుడు వివేక్.

ప్రతి జన్మదినం ఒక గండంలా ఐదు సంవత్సరాలు గడిచిపోయాయి. కానీ ఈసారి ఒక క్రొత్త సమస్య. వర్ధిని చెల్లెలు ఫ్యామిలి అమెరికా నుండి నెల రోజులు

సెలవు మీద ఇండియా వచ్చారు. పోయిన ఆదివారం ఇంటికి డిన్నర్‌కి వచ్చారు. వారితో పాటు వర్ధని అమ్మ నాన్న కూడా వచ్చారు. వర్ధని చెల్లెకు కుటుంబంలో అందరి పుట్టినరోజులు, మ్యారేజి డేలు గుర్తు పెట్టుకొనే అలవాటు. తనకి వివేక్ బర్త్‌డే కూడా బాగా గుర్తు. భోజనం మధ్యలో "ఏవండి బావగారూ, వచ్చే గురువారం మీ బర్త్‌డే కదా, మాకేమన్నా డిన్నర్ ఏర్పాట్లు ఉన్నాయా? లేకపోతే మీ పూజా ప్రసాదంతో సరిపెట్టుకోమంటారా" అని జోక్ చేసింది. అందరూ సరదాగా నవ్వేసినా వర్ధని మాత్రం కొంచెం అసౌకర్యంగా ఫీలయింది."పెళ్ళై ఆరేళ్లయినా ఇంకా అమ్మ కొంగు వదలకపోతే ఎలా అల్లుడు గారూ భక్తి, ముక్తి అంటూ పోతే మీలో డైనమిజం తగ్గిపోతుంది" అంటూ మంట మీద పెట్రోల్ చల్లారు వివేక్ అత్తగారు. ఈ మాటలతో వర్ధనిలో ఉక్రోషం, పంతం ఎక్కువయ్యాయి. అందరూ వెళ్ళిపోయిన తరువాత భార్యాభర్తలు గొడవపడ్డారు. వివేక్ ఆలోచించి ఈసారి పుట్టినరోజుకి అమ్మను తీసుకురానని తప్పకుండా డిన్నర్‌కి వెళ్దామని మాటిచ్చాడు. వర్ధని శాంతించింది.


***

ప్రతి సంవత్సరం పుట్టినరోజుకంటే రెండు మూడు రోజులు ముందు వరంగల్ తమ్ముడితో ఉంటున్న అమ్మను వెంటబెట్టుకొనిరావటం అలవాటు. ఈసారి అమ్మ దగ్గరకు వెళ్ళొద్దని, ఒకవేళ అమ్మగానీ, తమ్ముడుగానీ తేదీ గుర్తుపెట్టుకొని ఫోన్ చేస్తే వారం రోజులు బ్యాంక్‌లో ఆడిట్ నడుస్తుందని, తను చాలా బిజీ అని, అమ్మను ఈసారికి రావద్దని అబద్ధం ఆడాలని నిర్ణయించుకొన్నాడు. అమ్మ నుండి ఎటువంటి ఫోన్ రాకపోయేసరికి అమ్మకు తేదీ గుర్తుకు రాలేదని, ఈసారికి తను గండం గట్టెక్కాడని, వర్ధని చిరకాలపు ముచ్చట తీరుతుందని సంతోషపడ్డాడు. కానీ హఠాత్తుగా గంటక్రితం తమ్ముడు ఫోన్ చేసి అమ్మ బస్సుకి బయలుదేరిందని చెప్పాడు. వివేక్ చాలా నిరుత్సాహపడ్డాడు. అమ్మను వచ్చి తీసుకువెళ్ళనందుకు, కనీసం ఫోన్ కూడా చేయనందుకు అమ్మకు చాలా కోపం వచ్చిందని భార్యాభర్తలను కూర్చోబెట్టి చీవాట్లు పెట్టే ఛాన్స్ లేకపోలేదని తమ్ముడు హింట్ ఇచ్చాడు. ఇంత కాలం మౌనంగా భరిస్తూ వచ్చిన వర్ధని ఈసారి రియాక్ట్ కావచ్చు. ప్రచ్ఛన్న యుద్ధం కాస్తా ప్రత్యక్ష యుద్ధంగా మారిపోవచ్చు. అదే జరిగితే తను ఎవరికి సపోర్ట్ చేయాలి. అమ్మకు సపోర్ట్ చేసి వర్ధనికి ఇచ్చిన మాట తప్పాలా, లేక వర్ధనికి సపోర్ట్ చేసి అమ్మ మనసు నొప్పించాలా. ఈ సంశయం తనొక్కడిదే కాదు. కానీ తనకొక్కడికే క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం, అదీ పుట్టినరోజున వస్తుంది. వివేక్ చాలా నీరసించిపోయాడు. అమ్మ వస్తున్న విషయం వర్ధనికి ఎలా చెప్పాలి? ఆలోచిస్తూనే ఉన్నాడు.

***

వసంతమ్మగారు బస్సు దిగి ఆటోలో మార్కెట్‌కి వెళ్ళి పూజాసామాగ్రి తీసుకొని వివేక్ ఉండే అల్వాల్ వైపు వెళ్ళే సిటీబస్సు ఎక్కారు. బస్టాపులో దిగి కాలనీ వైపు మెల్లగా నడుస్తున్నారు. ప్రయాణ బడలిక, చేతిలో సంచి, సహకరించని మోకాళ్ళు- కొంత ఇబ్బంది పడుతూ నడు స్తున్నారు. కొత్త కాలనీ, జన సంచారం తక్కువ, అందుకనే ఆటోల జాడ కూడ లేదు. గత్యంతరం లేని పరిస్థితులలో అటుగా వెళ్తున్న కారుని లిఫ్ట్ ఇవ్వమన్నట్లుగా అడిగింది. కాని కారు ఆగలేదు, మరోకారు, మరో స్కూటర్ ముగ్గురు నలుగురిని లిఫ్ట్ అడిగింది. ఫలితం లేదు. వయసులో ఉన్నవారికైతే లిఫ్ట్ ఇవ్వటానికి ఎవరైనా ముందుకు వస్తారు అని మనసులో నవ్వుకుంది. ఇది తప్పదన్నట్లు నడక కొనసాగించింది. ఇంతలో ఆమెను దాటి చాలా ముందుకు వెళ్ళిపోయిన ఒక కారు ఆగి రివర్స్ గేర్‌లో వెనక్కి వచ్చి కారు తన ప్రక్కన ఆపి లోపలికి రమ్మన్నట్లుగా డోర్

**అమ్మ నుండి ఎటువంటి ఫోన్ రాకపోయేసరికి అమ్మకు తేదీ గుర్తుకు రాలేదని, ఈసారికి తను గండం గట్టెక్కాడని, వర్ధని చిరకాలపు ముచ్చట తీరుతుందని సంతోషపడ్డాడు. కానీ హఠాత్తుగా గంటక్రితం తమ్ముడు ఫోన్ చేసి అమ్మ బస్సుకి బయలుదేరిందని చెప్పాడు.**



తీసాడు డ్రైవింగ్ సీటులో ఉన్న యువకుడు. రివర్స్ గేర్‌లో వెనక్కి వచ్చి మరీ తనకు లిఫ్ట్ ఇస్తున్నాడంటే బహుశా వివేక్‌కు స్నేహితుడై యుండాలి. వసంతమ్మగారు కారులో కూర్చొన్నారు. పలకరింపుగా అతనిని చూసి నవ్వారు. తనను ఎరిగిన మనిషై యుండాలి అనుకొని ఇంటి అడ్రసు కూడా చెప్పలేదు "కొన్ని నిమిషాల తరువాత కారు కాలనీలోకి ప్రవేశించింది. రెండవ లేను దగ్గర కారు స్లో అయింది".

"నేను ఈ సెకండ్ లేన్‌లోకి వెళ్ళాలి మీరెక్కడ దిగుతారు"

"వెనక్కు వచ్చి మరీ నాకు లిఫ్ట్ ఇచ్చావంటే మా అబ్బాయికి స్నేహితుడివేమో అనుకున్నాను బాబు. నన్ను ఇంతకుముందు చూసుకుంటావు అనుకున్నా".

"లేదండీ మేము కూడా ఈ కాలనీలోకి కొత్తగా వచ్చాము"

"నన్ను ఇక్కడ దింపెయి బాబు, మేము పదవ లేన్‌లో ఉంటాము".

"పర్వాలేదండి. మిమ్మల్ని ఇంటిదగ్గర దింపుతాను" అంటూ కారు ముందుకు పోనిచ్చాడు. ఇంటిముందు కారు ఆపాడు. తనకు ఎటువంటి పరిచయం లేని ఆ యువకుడు తన కోసం వెనక్కి వచ్చి మరీ లిఫ్ట్

ఇచ్చి ఇంటిదగ్గర డ్రాప్ చేసినందుకు వసంతమ్మగారు చాలా సంతోషపడ్డారు. లిఫ్ట్ ద్వారా కలిగిన సౌకర్యం కంటే అతను చూపిన అభిమానం ఆమెను కదిలించింది. కారు దిగి వంగి కిటికి గుండా యువకుని వైపు చూస్తూ "చాలా థ్యాంక్స్ బాబు" అన్నారు.

"ఐ ఆల్వేస్ వాంట్ టు బి ఎ రీజన్ ఫర్ సమ్‌బడీస్ స్మైల్"- ఒకరి చిరునవ్వుకు నేనెప్పుడూ కారణం కావాలనుకుంటాను" అంటూ నవ్వుతూ సమాధానం చెప్పి వెళ్ళిపోయాడు. ఆ నవ్వులో స్వచ్ఛత, ఆ కళ్ళలో ప్రేమ, అతని మాటలో నిజాయితీ వసంతమ్మగారిని కొన్ని క్షణాలు కట్టిపడేశాయి. కొన్ని క్షణాల్లో తేరుకొని గేటు తీసి లోపలికి వెళ్ళి కాలింగ్‌బెల్ నొక్కారు. వర్ధని తలుపు తీసి వసంతమ్మగారిని ఆమె చేతిలో పూజా సామాగ్రితో ఉన్న సంచిని అసహనంగా చూసి, వచ్చీరాని నవ్వును ముఖానికి పులుముకొని "రండి అత్తయ్యా, ఆరోగ్యం బాగుంటుందా" వసంతమ్మగారు ఏమీ సమాధానం చెప్పలేదు. ఎందుకంటే ఆ పలకరింపులో ఎటువంటి ప్రేమ లేదు. కిచెన్ నుండి గ్లాసులో నీరు తెచ్చి వసంతమ్మగారికి ఇచ్చి,

"భోజనం వడ్డించమంటారా"

"భోజనం చేసి బయలుదేరాను, టీ ఇవ్వు చాలు" వర్ధని టీ పెట్టడానికి కిచెన్ లోకెళ్ళింది. వసంతమ్మగారు ఆలోచిస్తున్నారు. వర్ధని మాటలో, కళ్ళలో ఎటువంటి ఆహ్వానం, ప్రేమ లేదు. చాలా యాంత్రికంగా ఉంది ఆమె ప్రవర్తన. అది ఆమె సహజ స్వభావం కాదు. ప్రేమించే హృదయం. కానీ ఈ రోజు ఆమె ప్రవర్తన చాలా భిన్నంగా ఉంది. దానికి కారణం కూడా వసంతమ్మగారికి తెలుసు. పండుగలు, పుట్టినరోజులు, మ్యారేజి డేస్ వంటి సందర్భాలను ఫ్రెండ్స్‌తో కలిసి జరుపుకోవడం తనకు ఇష్టం. కాని ప్రతి వివేక్ పుట్టినరోజు పూజా కార్యక్రమాలతో గడపడం వర్ధనికి ఇష్టంలేదు. వసంతమ్మగారు దీర్ఘలోచనలో పడ్డారు. కొన్ని నిమిషాల ముందు తన మనసును తట్టిన ఆ యువకుని చిరునవ్వు ఆమె కనులముందు మెరుస్తుంది.

"ఒకరి చిరునవ్వుకు నేనెప్పుడు కారణం కావాలనుకుంటాను". గీతోపదేశంలా ఆ యువకుడు అన్న ఆ నాలుగు మాటలు వసంతమ్మగారి మనసులో ఒక సంఘర్షణలా ప్రారంభమైంది. అవును, ఏ పరిచయం లేని ఆ యువకుడు నా చిరునవ్వుకు తను కారణం కావాలనుకున్నాడు. కానీ నేను కోడలు మనసు నొప్పించినా పరవాలేదు, నా పంతం నెగ్గాలని కోరుకుంటున్నాను. తల్లిగా నా హోదాను అడ్డం పెట్టుకొని వారి ఇష్టానికి వ్యతిరేకంగా వ్యవహరించటం ఎంతవరకు న్యాయం? ఆమె సహృదయం మంచి నిర్ణయం తీసుకోవటానికి ఆమె సహకరించింది.

"అమ్మా... వర్ధని" వసంతమ్మగారు పిలిచారు. కోడలు టీ కప్పుతో వచ్చి అచేతనంగా ఆమె ముందు నిలబడింది.

"నేను ఈ రోజు రాకపోతే మీరు ఎక్కడికి వెళ్దామనుకున్నారు"

వర్ధని ఏమీ మాట్లాడలేదు.

"పరవాలేదు చెప్పమ్మా" అనునయంగా అడిగారు వసంతమ్మ.

"పాలెస్ హైట్‌కి డిన్నర్‌కి వెళ్దామనుకున్నాం"

"ఈ రోజు మనం డిన్నర్‌కి వెళ్తున్నాం" అన్నారు వసంతమ్మ. వర్ధనికి షాక్ కొట్టినంత పనైంది.

"బాబుకి నేను ఫోన్ చేసి బ్యాంకు నుండి త్వరగా వచ్చేయమని చెబుతాను. నువ్వు మమ్మివాళ్ళకి ఫోన్ చేసి చెప్పు"

వసంతమ్మగారు వివేక్ సెల్‌కి ఫోన్ చేసి హోటల్లో టేబుల్ బుక్ చేయమని త్వరగా ఇంటికి వచ్చేయమని చెప్పారు. ఏదో చెప్పబోతే వివేక్‌కు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. వర్ధనికి ఏమీ అర్థం కావట్లేదు. అత్తగారు ఎందుకు ఇంత హఠాత్తుగా నిర్ణయం మార్చుకున్నారు.తన ప్రవర్తన ఆమె మనసును నొప్పించిందా. వర్ధనిలో ఏదో అపరాధ భావన.

"మీరు పూజా సామాగ్రి కూడా తెచ్చారు. గుడికే వెళ్దాం అత్తయ్యా" వర్ధని సర్ది

**వర్ధని తల్లితో గొడవపడి ఉండవచ్చుని లేదా బలవంతగా తల్లిని ఒప్పించి ఉండవచ్చుని వివేక్‌కు అనుమానం. కానీ వసంతమ్మగారు నవ్వుతూ వివేక్‌ని దగ్గరకు తీసుకొని "వందేళ్ళు ఆరోగ్య ంగా సంతోషంగా జీవించు నాయనా" అంటూ దీవించారు. వివేక్ వర్ధని వైపు చూశాడు. ఆమెలో ఏదో సంశయం.**

చెప్పబోయింది.

"ఏమ్మా, ఐదు సంవత్సరాల నుండి వాడి ప్రతి పుట్టినరోజు నేనే వచ్చి గుడికి తీసుకెళ్తున్నా, నువ్వు ఒక్కరోజు కూడా అడ్డు చెప్పలేదు. కనీసం ఈసారయినా డిన్నర్‌కి వెళ్ళి సరదాగా గడపండి. అమెరికా నుండి మీ చెల్లి కూడా వచ్చింది కదా!"

అత్తగారి మాటలకి వర్ధని నిలువెల్లా కరిగిపోయింది. ఒక గంట క్రితం వరకు అత్తగారితో వాదించైనా వివేక్‌ను డిన్నర్‌కి తీసుకెళ్దామనుకున్న వర్ధని, ఇపుడు స్వయంగా అత్తగారే డిన్నర్ ప్రోగ్రాం గురించి మాట్లాడుతుంటే, కాదు గుడికే వెళ్దామని ఆమెను ఒప్పించే ప్రయత్నం చేస్తుంది వర్ధని. మనిషి మనసు ఆధిపత్యాన్ని ధిక్కరిస్తుంది. ప్రేమకు దాసోహమంటుంది. కాని మనుషులు ఎక్కువగా ఆధిపత్యాన్నే ఆశ్రయిస్తారు. అందుకే ఎక్కువగా ఓడిపోతారు.

"పదమ్మ స్నానం చేసి త్వరగా తయారవ్వు", పురమాయించారు వసంతమ్మ. ఒక గంటలో ఇద్దరు రెడీ అయ్యారు. ఇంతలో కారు హారన్ మ్రోగింది. వర్ధని వెళ్ళి తలుపు తీసింది. వివేక్ లోపలికి వస్తూ తల్లి వైపు చూశాడు. వర్ధని తల్లితో గొడవపడి ఉండవచ్చుని లేదా బలవంతంగా తల్లిని ఒప్పించి ఉండవచ్చుని వివేక్‌కు అనుమానం. కానీ వసంతమ్మగారు నవ్వుతూ వివేక్‌ని దగ్గరకు తీసుకొని "వందేళ్ళు ఆరోగ్య ంగా సంతోషంగా జీవించు నాయనా" అంటూ దీవించారు. వివేక్ వర్ధని వైపు చూశాడు. ఆమెలో ఏదో సంశయం. భర్త తన గురించి ఏమనుకుంటున్నాడో, తను బలవంతంగా ఆమెను డిన్నర్‌కు ఒప్పించాననుకుంటున్నాడా, ఇందులో తన ప్రమేయం లేదంటే నమ్ముతాడా, వర్ధనిలో ఏదో సంశయం, వారి ఆలోచనలు అర్థం చేసుకున్న వసంతమ్మగారు "వర్ధని గుడికే వెళ్ళాలని పట్టుపట్టిందిరా. నేనే బలవంతంగా డిన్నర్‌కి ఒప్పించాను. నువ్వు వెళ్ళి త్వరగా రెడీ అవ్వు నాన్న" ఆ క్షణాన వర్ధని కళ్ళకు వసంతమ్మగారు అత్తగారిలా కాక మనసెరిగిన ప్రియనేస్తంలా కనిపించారు.

***

వర్ధని, వాళ్ళ చెల్లి, అమ్మగారు, వసంతమ్మగారు వివేక్ సంతోషంగా సరదాగా హోటల్‌లో డిన్నర్‌చేసి ఇంటికి చేరారు. ప్రతి సంవత్సరం ఒక గండంలా గడిచే వివేక్ పుట్టినరోజు ఈ సంవత్సరం ఒక వేడుకలా సరదాగా గడిచిపోయింది.

***

రాత్రి బెడ్‌రూంలో వివేక్ వర్ధనిలకు పెద్ద సంశయం. వసంతమ్మ అంత హఠాత్తుగా నిర్ణయాన్ని ఎందుకు మార్చుకున్నారు. వివేక్ వర్ధనిలకు ఇది ఎప్పటికీవీడని ఒక చిక్కు ప్రశ్న. వసంతమ్మగారు తన రూమ్‌లో పడుకొని ఆలోచిస్తున్నారు. ప్రతి పుట్టినరోజు తనతో బలవంతంగా అయిష్టంగా గుడికి వచ్చేవాడు వివేక్. గుడి నుండి తిరిగి వచ్చాక ముభావంగా, వివేక్, వర్ధని తను కూర్చొని భోజనం చేసేవారు. భోజనం చేస్తున్నపుడు వర్ధని కళ్ళల్లో ఏదో ఈర్ష్య, కాని ఈ రోజు హోటల్లో భోజనం చేస్తున్నప్పుడు వారి కళ్ళల్లో మెరుపు వారి ముఖంలో సంతోషం వసంతమ్మగారికి ఎంతో తృప్తినిచ్చాయి. తన ఆలోచనల్లో ఇంత మార్పుకి కారణం అయిన ఆ యువకుణ్ణి మనసులోనే అభినందించింది. 63 ఏళ్ళ జీవితంలో తను తెలుసుకోలేని ప్రేమతత్వాన్ని మూడు మాటల్లో తెలియజేశాడు. యువకులంటే బాధ్యతారహితులని, విలాసపురుషులని, స్వార్థపరులని అనుకునేది. కాని యువత మీద ఆమె అభిప్రాయం పూర్తిగా మారిపోయింది.

కానీ, తను చేసిన చిన్న సహాయం, చిరునవ్వుతో చెప్పిన రెండు మంచి మాటలు కొందరి జీవితాలలో నవ్వులు పూయించాయని ఒక కుటుంబానికి ప్రేమ సందేశాన్ని వినిపించిందని ఆ యువకునికి తెలియదు. ఒక మంచి మనసు, సహకరించే హృదయం, చిరునవ్వు... ఇవన్నీ దీపాల్లాంటివి. మరిన్ని దీపాలు వెలిగించగలవు. •